# హస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీ,నిర్మాణాలను చేపట్టాలి

## సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా.






**కావలి :పెన్ పవర్ -(ఆర్సీ ఇంచార్జ్) అక్టోబర్ 30**

కావలి పట్టణంలో హస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు డ్రైనేజీ నిర్మాణాలను చేపట్టాలని కోరుతూ గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం మేనేజర్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ పట్టణంలో రోడ్లు దెబ్బతిని గుంటలు పడి డ్రైనేజీ కాలువలు సక్రమంగా లేక కొన్ని రోడ్లు మధ్యకు పగిలిపోయి రెండు భాగాలుగా విడిపోయి ఉన్నాయని వీటి వలన ప్రజలు ద్విచక్ర వాహనదారులు నిత్యం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సంవత్సరాల తరబడి ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారని ముఖ్యంగా వర్షాలు కురిసినప్పుడు డ్రైనేజీ లు నిండి రోడ్లు పైకి నీళ్లు వస్తున్నాయని దీని వలన ప్రజలు తిరిగేందుకు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. అంతేకాకుండా కొన్ని ప్రాంతాలలో ఇళ్ల చుట్టూ నీళ్లు చుట్టుముడుతున్నాయని దీనివలన ప్రజలు ఆందోళన చెందుతున్నారని రోడ్లు డ్రైనేజీ సక్రమంగా లేనందునే ఈ పరిస్థితి ఉన్నదని ముఖ్యంగా భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేయాల్సి ఉన్నదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అధికారులు స్పందించి రోడ్లు డ్రైనేజీ లకు నిర్మాణాలు చేపట్టి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షుడు పి. తిరుపాలు, సిపిఎం పార్టీ నాయకులు వై. కృష్ణమోహన్, బి. కృష్ణయ్య, జి మధుసూదనరావు, మేడా వెంకటేశ్వర్లు ప్రజా సంఘాల నాయకులు ఎం. రమణయ్య, మధు, పి వెంకటేశ్వర్లు తోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజిలెన్సు అవేర్నెస్ వీక్ 2025 పై అవగాహన సదస్సు



**కావలి :పెన్ పవర్ -(ఆర్సీ ఇంచార్జ్) అక్టోబర్ 30**

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు "విజిలెన్సు అవేర్నెస్ వీక్ - 2025" కార్యక్రమంలో భాగంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విజిలెన్స్ %ఇ% ఎన్ఫోర్స్మెంట్ శాఖ ఆధ్వర్యంలో గురువారం కావలి పురపాలక సంఘ సమావేశ మందిరంలో అవగాహనా సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా విజిలెన్స్ %ఇ% ఎన్ఫోర్స్మెంట్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ. శ్రీహరి రావు, తహసిల్దార్ కృష్ణ ప్రసాద్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకట రెడ్డి మాట్లాడుతూ పురపాలక సంఘాలలో ఆస్థి పన్ను విధింపు, భవన నిర్మాణ ప్లానుల అనుమతులు, అక్రమ నిర్మాణాల మరియు అక్రమ లే అవుట్ల క్రమబద్దీకరణలో ప్రభుత్వం వారు ఎప్పటికప్పుడు జారీ చేయు నియమ నిబంధనలను ప్రతి ఒక్కరు తు.చ. తప్పక పాటించాలని, ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా పారదర్శకంగా పని చేయాలని అన్నారు. డి %ఇ% ఓ ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, ప్రకటన పన్నుల విధింపు వాటి సక్రమ వసూలు ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఎక్కువ మొత్తములో ఆదాయ వనరులను సమకూర్చుటలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.అనంతరం సిబ్బంది చేత విజిలెన్స్ ప్రతిజ్ఞ చేయించి, కొన్ని నినాదాలను చదివి వినిపించడమైనది. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ జి. శ్రావణ్ కుమార్, మేనేజరు పి.ఫణి కుమార్, మునిసిపల్ సిబ్బంది మరియు వార్డు సచివాలయాల పరిపాలనా కార్యదర్శులు, వార్డు ప్రణాళికా - క్రమబద్ధీకరణ కార్యదర్శులు మరియు వార్డు మహిళా సంరక్షణా కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఇష్టారాజ్యంగా రోడ్ల తవ్వకాలు

### -అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు





**గూడూరు, పెన్ పవర్, అక్టోబర్,30**

కోట, విద్యానగర్ ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి దారుణంగా మారింది. భూగర్భ కేబుల్, పైప్‌లైన్ పనుల పేరుతో ఇష్టారాజ్యంగా రోడ్లను తవ్వేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చల్లకాలువ వద్ద తవ్విన భారీ గుంతలు వాహనాలకు ప్రమాదంగా మారాయి. గుంతలను పూడ్చడంలో సంబంధిత శాఖల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఒకవైపు కొత్త రోడ్లు వేస్తే, మరోవైపు తవ్వకాలు జరగడం వల్ల కోట్లాది రూపాయల ప్రజా ధనం వృథా అవుతోంది. కేబుల్ కాంట్రాక్టర్లు, ఆర్ అండ్ బి అధికారులు, ఇతర శాఖల మధ్య సమన్వయం లేకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వెంటనే జిల్లా ఉన్నత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఎద్దులరేవు దగ్గర రహదారి కోత

### ప్రజలకు ఇబ్బందులు

**సి ఎస్ పురం , పెన్ పవర్ అక్టోబర్ 30**

మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఎద్దుల రేవు వద్ద వరద ప్రవాహానికి రహదారి కోతకు గురైంది. ఆ మార్గంలో నిత్యం ప్రయాణించే రైతులు, ప్రజలు, పశు పోషకులు నీరు ఉధృతంగా ప్రవహించి రహదారి కోతకు గురి కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు పొలాలకు వెళ్లే మార్గం రహదారిలో ట్రాక్టర్లు వెళ్ళుటకు దారి లేక పొలాలలో పనులు చేసుకోవటానికి కష్టంగా మారిందని పలువురు రైతులు తెలిపారు రహదారి మరమ్మత్తులు చేయకపోతే వ్యవసాయ పనులు తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందని అన్నారు అధికారులు వెంటనే స్పందించి రహదారిని పరిశీలించి పునరుద్ధరణ పనులు చేపట్టాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

# పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే తాటి పర్తి చంద్రశేఖర్





**పుల్లల చెరువు పెన్ పవర్ అక్టోబర్ 30**

మొందా తుఫాన్ కారణంగా పుల్లల చెరువు మండలంలో దెబ్బతిన్న పంట పొలాలను యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటి పర్తి చంద్రశేఖర్ స్వయంగా సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి వారి సమస్యలు, నష్టాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల గురించి వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించింది. అయితే, ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకుండా వారం గడిచిన తర్వాతే స్పందించింది. తుఫాను తీవ్రత పెరిగిన తర్వాతే రివ్యూల పేరుతో ఫోటోలు రిలీజ్ చేయడమే తప్ప, నేలస్థాయిలో ఎటువంటి విపత్తు నివారణ చర్యలు చేపట్టలేదు అని అన్నారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. చంద్రబాబు గారు ఆస్ట్రేలియా పర్యటనలో ఉండగా, రాష్ట్రం తీవ్రమైన వరదలతో కొట్టుమిట్టాడుతోంది. మంత్రులు ఎవరూ రాకుండా, ఏసీ గదుల్లో రివ్యూలు పెట్టడం ఎంత దారుణమో రైతులే చెప్పాలి అని ఆగ్రహం వ్యక్తం చేశారు.మిర్చి, పొగాకు, కంది, మొక్కజొన్న, పత్తి, అన్నీ పంటలు నీట మునిగిపోయి పూర్తిగా నాశనం అయ్యాయి. ముఖ్యంగా మిర్చి పంటలో సగం వరకు నిలువచేసే అవకాశం ఉన్నా, దానికోసం చాలా ఖర్చు పెట్టాల్సి వస్తుంది. ఈ స్థితిలో రైతులు ఎలా నిలబడగలరు. వైఎస్సార్ ప్రభుత్వం ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి గారు వెంటనే స్పందించి ఎకరానికి 10,000 చొప్పున సాయం ప్రకటించారు. అదనంగా కుటుంబ పోషణ కోసం 3,000 నగదు, సరుకులు, ఇన్‌పుట్ సబ్సిడీ, భీమా కానీ, ఈ ప్రభుత్వం మాత్రం బీమా గానీ, సబ్సిడీ గానీ ఇవ్వక రైతులను దోపిడీ చేస్తోంది. ఇదే దోపిడీ ప్రభుత్వం అని మండిపడ్డారు.2014-9 మధ్యలో చంద్రబాబు పాలనలో వర్షాలు, తుఫానుల కారణంగా 30 నుంచి 60 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. కానీ, వైఎస్సార్ కాలంలో ఏడు తుఫానులు వచ్చినా కేవలం ఏడు మంది మాత్రమే మృతి చెందారు. ఇది ప్రతిస్పందనా వ్యవస్థల మధ్య తేడా స్పష్టంగా చూపుతుంది, అని పేర్కొన్నారు.పశ్చిమ ప్రకాశం జిల్లా వెనుకబడిన ప్రాంతమని, ఇక్కడి రైతులు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని చెప్పారు.ఈ ప్రాంతం రాష్ట్రానికి ఆహార భద్రతను ఇచ్చే ప్రధాన వ్యవసాయ కేంద్రం. ఇక్కడ పంటలు నాశనం కావడం అనేది సాధారణ ఘటన కాదు ఇది జాతీయ విపత్తుగా పరిగణించాలి. కేంద్రం దృష్టికి తీసుకెళ్లి తగిన నిధులు సమకూర్చాలి, అని డిమాండ్ చేశారు.చాపలమడుగు చెరువు కల్వ కూలిపోయింది, కాలువలు దెబ్బతిన్నాయి, ఒకటిన్నర సంవత్సరంగా మరమ్మతులు చేయలేదు. నీరు సముద్రంలోకి వెళ్లిపోతుంది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి. పత్రిక మిత్రులు కూడా ఈ సమస్యలను వెలుగులోకి తేవాలి, అని విజ్ఞప్తి చేశారు.రైతులు పంట నష్టం భరించలేని పరిస్థితిలో ఉన్నారు. ప్రభుత్వము వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ, భీమా, పంట నష్టపరిహారం, గృహ నష్టం సాయం ప్రకటించాలి. ప్రభుత్వం, అధికారులకి వచ్చి పరిస్థితిని అంచనా వేయాలి. ప్రజల పక్షాన నిలబడి, రైతుల ఆవేదనను ప్రభుత్వానికి తీసుకెళ్తాం, అని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర పంచాయితీ వింగ్ ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి సుబ్బారెడ్డి,వైసీపీ ప్రకాశం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొర్లకుంట జానకి రఘు, పుల్లల చెరువు మండల వైస్ ఎంపీపీ లింగంగుంట్ల రాములు,వైసీపీ మండల కన్వీనర్ దోమకాల వెంకటేశ్వర్లు, నాయుడుపాలెం సర్పంచ్ ఆవుల కోటిరెడ్డి, మల్లపాలెం సర్పంచ్ రవణరెడ్డి, మాజీ ఎంపీపీ లాజర్,కుందూరు కోటిరెడ్డి, వైసీపీ మండల మహిళ అధ్యక్షురాలు రవణమ్మ (షర్మిల)మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెంధా తుఫాన్ బాధితులకు నష్టపరిహారంపై ఆరా తీసిన ఎమ్మెల్యే బొజ్జల

### పార్టీ నాయకులకు దిశా నిర్దేశం : ఎమ్మెల్యే బొజ్జల"





**శ్రీకాళహస్తి , పెన్ పవర్ , అక్టోబర్ 30**

తుఫాన్ కారణంగా కూలిన ఇండ్లుకు నష్టపరిహారం అందిందా లేదా రెవెన్యూ శాఖ అధికారులు సకాలంలో స్పందించారా లేదా అని శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, పార్టీ నాయకులను అడిగి వివరాలు తెలుసుకోవడం జరిగింది, అందులో భాగంగా భారీ వర్షాల వల్ల నష్టపోయినటువంటి నిర్వాసితుల ఇళ్ల వద్దకు శ్రీకాళహస్తి పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్ మరియు తే.దే.పా నాయకులు వెళ్లి వారికి ప్రభుత్వం తరఫున అధికారులు సకాలంలో స్పందించారా అని అడిగి తెలుసుకోవడం జరిగింది, అనంతరం రెవెన్యూ శాఖ అధికారులతో మాట్లాడి కూలిపోయిన ఇండ్లకు త్వరతిగతిగా ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందేలా చేయాలని కోరడం జరిగింది, అదేవిధంగా అక్కడున్నటువంటి నిర్వాసితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చినటువంటి అంశంలో భాగంగా కోర్టు ప్రహరీ గోడ మొత్తం కూలి పోయే దుస్థితిలో ఉంది అని, వృద్దులు, చంటిబిడ్డలు, పధాచ్చారులు, ఎక్కువ మంది రాకపోకలు సాగిస్తూ ఉంటారు.కనుక రాబోవు రోజులలో ఎలాంటి అసందర్భం జరగకుండా ప్రాణ నష్టం, ఆర్థిక నష్టం కలగకుండా ఉండే విధంగా ఎమ్మెల్యే చొరవ చూపి చర్యలు తీసుకోవాలని ,అక్కడ ఉన్నటువంటి స్థానికులు తె.దే.పా నాయకుల దృష్టికి తీసుకురావడం జరిగింది,పై కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బాలు ఢిల్లీ,రాకేష్, నవీన్,వివేక్, తుమ్మ బాల తదితరులు పాల్గొన్నారు.

# నివాస గృహం కోల్పోయిన కుటుంబానికి అండగా బీజేపీ షబానా

### ఆ కుటుంబానికి నగదు, సరుకులు అందజేత





**మార్కాపురం టౌన్ పెన్ పవర్ అక్టోబర్ 30**

మార్కాపురం పట్టణంలోని భగత్ సింగ్ కాలనీలో తుఫాన్ కారణంగా నివాస గృహం కూలిపోయి ఇబ్బందులు పడుతున్న కుటుంబానికి బిజెపి మైనార్టీ మోర్చా సీనియర్ నాయకురాలు షేక్ షబానా తన వంతు సహకారంగా నెల రోజులకు సరిపడా నిత్యవసర సరుకుల తో పాటు ఆర్థిక సహాయాన్ని చేశారు. ఆ వార్డులోని కౌన్సిలర్ హర్షిత బాబీలు సోషల్ మీడియాలో చేసిన పోస్టులు షేక్ షబానా దృష్టికి రాగా స్పందించిన షబానా తన వంతు సహకారం అందించడంతో స్థానిక ప్రజలు ఆమెను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి, హౌసింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.త్వరలో వారికి నూతన గృహాన్ని ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ హర్షిత బాబి మాట్లాడుతూ సేవ దృక్పథంతో ముందుకు దూసుకెళ్తున్న షేక్ షబానా ఆ కుటుంబానికి చేసిన సహాయం అభినందనీయమని, ఆ పేద కుటుంబానికి ప్రభుత్వం నుండి అందవలసిన సహాయాన్ని అందే విధంగా కృషి చేస్తున్నామని బాబి తెలిపారు. అదేవిధంగా ఆర్థిక సహాయంతో పాటు నిత్యవసర సరుకులు అందించిన షేక్ షబానాకు వార్డు కౌన్సిలర్, ఆ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈమె వెంట 16వార్డ్ ఇన్చార్జ్ చల్లగాలి విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

# మహిళపై లైంగిక వేధింపుల కేసులో రెండు సంవత్సరాల జైలు శిక్ష

**పొదిలి, పెన్ పవర్, అక్టోబర్ 30**

ఒక మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమానా విధిస్తూ ఒంగోలు న్యాయస్థానం తీర్పు చెప్పింది. మండలంలోని ఆముదాలపల్లి గ్రామానికి చెందిన ఎస్తేరు రాణి అనే మహిళ చీమకుర్తి లోనే ఒక ప్రైవేటు వైద్యశాలలో నర్సుగా పనిచేస్తుంది. కాగా ఆమె తన విధులను ముగించుకొని పొదిలికి విచ్చేసి, అక్కడ ఒక ఆటోను తమ గ్రామానికి వెళ్లేందుకు ఎక్కింది. అయితే ఆటో డ్రైవర్ ఓబుల్ రెడ్డి అనే అతను ఆటోలో ఉన్న రాణి పై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పొదిలి పోలీస్ స్టేషన్లో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయడం జరిగింది. ఈ సంఘటన 2021 వ సంవత్సరంలో 29వ తేదీ 10వ నెలలో జరిగింది. ఈ సంఘటన పై పొదిలి పోలీసులు చార్జిషీట్ దాఖలు చేసి ఒంగోలు ఏడవ న్యాయస్థానంలో కేసు అప్పగించడం జరిగింది. ఈ కేసు పూర్వాపరాలను విచారించిన ఒంగోలు న్యాయమూర్తి నిందితుడి రెండేళ్లపాటు జైలు శిక్ష, పదివేల రూపాయలు జరిమానా విధిస్తూ గురువారం నాడు తీర్పు చెప్పారు. కేసును సమర్థవంతంగా కొనసాగించినందుకు అప్పటి పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ వై శ్రీహరి, దర్శి డివైఎస్పి వి నారాయణస్వామి రెడ్డి తోపాటు కోర్టు లైజన్ హెడ్ కానిస్టేబుల్ ఏవి శేషయ్య, కానిస్టేబుల్ యు. రాజారత్నం తదితరులను జిల్లా పోలీసు సూపరింటెండెంట్ హర్షవర్ధన్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రత్తి పంటకే తీవ్ర నష్టం

### టిడిపి మండల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి

**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 30**



గిద్దలూరు మండలంలోని కొత్తకోట పంచాయతీ పరిధిలో కొత్త కోట, తాళ్ల పల్లి గ్రామాల్లో రైతుభరోసా అధికారులు తమ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు గ్రామాల్లోని పంటపొలాలను పరిశీలించి, నష్టాలను నమోదు చేశారు. పంచాయతీ పరిధిలో ప్రత్తి పంటను 152 ఎకరాల్లో 133 మంది రైతులు, కంది పంటను 112 ఎకరాల్లో 94 మంది రైతులు, పొగాకు పంటను 13 ఎకరాల్లో 9 మంది రైతులు సాగు చేస్తున్నట్టు. సచివాలయం రైతు భరోసా అధికారి మస్తాన్ తెలిపారు. గిద్దలూరు మండలం తెలుగుదేశం పార్టీ మండల నాయకులు మార్తాల సుబ్బారెడ్డి మాట్లాడుతూ మొంథా తుఫాన్ రైతాంగానికి తీవ్ర నష్టాలపాలు చేసిందని, కొత్తకోట పంచాయతీ పరిధిలో ఉన్న ప్రత్తి, కంది, పొగాకు పంటలను అధికారులతో కలిసి పరిశీలించడం జరిగిందని ప్రత్తి పంటలో నీరు చేరి పంటలన్నీ నీరు చచ్చు పడిందని తెలిపారు. గిద్దలూరు మండలంలో 617హెక్టర్ల (1524 ఎకరాల) లో ప్రత్తి పంటను సాగు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతీ ప్రత్తి రైతుకు నష్టపరిహారం అందే విషయాన్ని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర ప్రభుత్వ నియమాలు, ఆదేశాల మేరకు రైతుకు నష్ట పరిహారం అందేలా కృషి చేస్తామని రైతులకు భరోసా కల్పించారు.

## సబ్ జైల్ ను తనిఖీ చేసిన జిల్లా సీనియర్

### సివిల్ జడ్జి ఇబ్రహీం షరీఫ్



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 30**

గిద్దలూరు సబ్ జైల్ ను జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ,జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ యస్.కె. ఇబ్రహీం షరీఫ్, గిద్దలూరు న్యాయమూర్తులు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్ చంద్ర, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ. ఓంకార్ గురువారం సందర్శించారు. జైలులో ఉన్న ఖైదీలను ఒక్కొక్కరిగా వారి యొక్క బాగోగులు, జైలులో గల సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. చట్టపరమైన సహాయం ఖైదీలందరికి కూడా అందేలాగా జైలర్ కు ఆదేశాలు ఇచ్చారు. ఖైదీలందరికి అందించే ఆహర పదార్థాల నాణ్యతను కూడా పరిశీలించి తగు ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ సూపర్డెంట్ యూ. లింగారెడ్డి, లీగల్ ఎయిడ్ న్యాయవ్యాది కె. రవి ప్రకాష్ బాబు, పారా లీగల్ వాలంటరీ అద్దంకి. మధుసూధనరావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# చెన్నయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



**పుల్లల చెరువు పెన్ పవర్ అక్టోబర్ 30**

పుల్లల చెరువు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఆకుల పెద్ద చెన్నయ్య గత సోమవారం మరణించిన సంగతి తెలుసుకొని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటి పర్తి చంద్రశేఖర్ గురువారం వారి కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆకుల పెద్ద చెన్నయ్య వైసీపీ పార్టీ పట్ల మన నాయకుడు జగన్ మోహన్ రెడ్డి పట్ల అపారమైన అభిమానాన్ని కలిగి ఉన్న నిజమైన కార్యకర్త. తాను ఉండడానికి కనీస సౌకర్యమైన ఇల్లు కూడా లేకపోయినా పార్టీ పట్ల ఆయనకు ఉన్న విశ్వాసం ఏమాత్రం తగ్గలేదు. ఇలాంటి కట్టుబాటు ఉన్న కార్యకర్తలే మన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పునాది స్తంభాలనీ ఆయన అన్నారు.మన నాయకుడు వైయస్సార్ జగన్ మోహన్ రెడ్డి ఎల్లప్పుడూ ఇలాంటి అంకితభావంతో పని చేసే కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటారు. చెన్నయ్య కుటుంబానికి పార్టీ తరపున అన్ని విధాలా తోడ్పాటును అందిస్తామని హామీ ఇచ్చారు.పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ మనలో ఎవరో ఒకరు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు, ఆ కుటుంబం మన పార్టీ కుటుంబం అని గుర్తుంచుకుని అందరం కలసి అండగా నిలబడాలన్నారు. ఇది మన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంస్కృతి, మన నాయకుడు జగన్ మోహన్ రెడ్డి మార్గదర్శకత్వం అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర పంచాయితీ వింగ్ ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి సుబ్బారెడ్డి,వైసీపీ ప్రకాశం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొర్లకుంట జానకి రఘు, పుల్లల చెరువు మండల వైస్ ఎంపీపీ లింగంగుంట్ల రాములు,వైసీపీ మండల కన్వీనర్ దోమకాల వెంకటేశ్వర్లు, నాయుడుపాలెం సర్పంచ్ ఆవుల కోటిరెడ్డి, మల్లపాలెం సర్పంచ్ రవణరెడ్డి, మాజీ ఎంపీపీ లాజర్,కుందూరు కోటిరెడ్డి, వైసీపీ మండల మహిళ అధ్యక్షురాలు రవణమ్మ (షర్మిల)మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలకు ఏ కష్టం వచ్చిన కూటమి ప్రభుత్వం అండగాఉంటుంది

### అనుభవం ఉన్న చంద్రన్న నాయకత్వంలో మొంథా తుఫాన్ ను సమర్థవంతంగా ఎదుర్కొన్నాము

### మొంథా తుఫాన్ పునరావాస బాధితులకు రేషన్ సరుకులు పంపిణి చేసిన ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 30**





మొంథా తుఫాన్ ముంపు ప్రాంత ప్రజలకు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి గురువారం రేషన్ పంపిణి చేశారు. పట్టణంలోని పాములపల్లె రోడ్డులోని రేషన్ షాపులో, తుఫాన్ తీవ్రత తగ్గిన అనంతరం పునరావాస కేంద్రం నుండి తమ గృహాలకు చేరుకున్న 17వ వార్డు సారంగపాని వీధికి చెందిన బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి 25కేజీల బియ్యం, కేజీ చెక్కర, కేజీ కందిపప్పు, కేజీ వంట నూనె, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళాదుంపలు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గంలో మొంథా తుఫాన్ ప్రభావంతో చెరువులు, వాగులు వరదలతో పోటేత్తాయన్నారు. గిద్దలూరు పట్టణంలోని ముంపు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి అక్కడ అన్నీ వసతులు కల్పించామని, పునరావాస కేంద్రాల నుండి వచ్చిన వారికీ కూటమి ప్రభుత్వం నేడు నిత్యావసర వస్తువులు పంపిణి చేస్తున్నామన్నారు. అదే విధంగా పునరావాస కేంద్రంలోని బాధితులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు అందచేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు కష్టం వస్తే ఒక్క క్షణం కూడా ఆలోచన చేయకుండా ప్రజలను ఆదుకుంటుందన్నారు. ప్రజా భద్రతే లక్ష్యం అన్నారు. అనుభవం ఉన్న మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మొంథా తుఫాన్ ముంపు ప్రాంత ప్రజలను సంరక్షించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో అధికార యంత్రాంగం మొంథా తుఫాన్ ను ఎదుర్కోవటంలో అహర్నిశలు శ్రమించారని, జిల్లా అధికారులకు, పోలీస్, రెవిన్యూ, స్పెషల్ అధికారులు, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఆర్ –బి సచివాలయ సిబ్బంది ఇలా ప్రతీ ఒక్క డిపార్ట్మెంట్ కృషి చేశారని వారందరికీ అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గిద్దలూరు తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఈవి రమణ బాబు, ఎన్ఫోర్స్మెంట్ డీటీ రామనారాయణ రెడ్డి, జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి, పట్టణ టీడీపీ అధ్యక్షులు సయ్యద్ శానేశా వలి, 17వ వార్డు ఇన్చార్జ్ పిడతల రవితేజ, 18వ వార్డు కౌన్సిలర్ షేక్ షేక్షావలి, స్థానిక నాయకులు బొంతా లక్ష్మిదేవి, దూదేకుల దస్తగిరి, గిద్దలూరు మద్దిలేటి, బొర్రా రాఘవేంద్ర యాదవ్, దూదేకుల ఫాతిమా, షేక్ బాషా పట్టణ కౌన్సిలర్లు లోక్కు రమేష్, బూనబోయిన చంద్రశేఖర్ , పట్టణ నాయకులు తదితరులు పాల్గోన్నారు.

## షెహబాష్ రెవెన్యూ, మున్సిపాలిటీ, ఇరిగేషన్, పోలీస్ శాఖల అధికారులకు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 30**



గిద్దలూరు నియోజకవర్గంలోని అన్నిశాఖల అధికారులకు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోకరెడ్డి అభినందించారు. ముంత తుఫాన్ సంధర్భంగా నియోజకవర్గంలో ఎలాంటి ప్రాణనష్టం , ఆస్తినష్టం లేకుండా నిలువరించి ప్రజలకు అండగా ఉంది, ఎప్పటికప్పుడు ప్రభుత్వ సూచనలు పాటిస్తూ గట్టి చర్యలు తీసుకోవడంలో అధికారుల పాత్ర మారువలేనిదన్నారు. రెవెన్యూ, మున్సిపాలిటీ, ఇరిగేషన్, పోలీస్ , విద్యుత్, ఇతర అన్నిశాఖల అధికారులు వారి వారి విధులు సక్రమంగా నిర్వహించారని, దాంతోనే విపత్తు నుంచి బయట పడగలిగామని ఎమ్మెల్యే అశోకరెడ్డి ఆయా శాఖల అధికారులకు కితాబిచ్చారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. తుఫాన్ హెచ్చరికలు జారీ అయిన నాటి నుండి ప్రతి అధికారి ప్రజలను అప్రమత్తం చేసి తగిన జాగ్రత్తలు తీసుకున్నారని పేర్కొన్నారు. అందుకే విపత్తు నుండి బయట పడగలిగామన్నారు. అధికారుల , క్షేత్ర స్థాయి సిబ్బంది సేవలు భేష అన్నారు. అయినా ప్రకృతి విలయం వలన ప్రత్తి, మిర్చి , మొక్కజొన్న లాంటి పంటకు భారీ నష్టం వాటిల్లిందని, వ్యవసాయ శాఖ అధికారులు పంటనష్టాలను అంచనావేసి నివేదికలు అందజేయాలన్నారు. ప్రజల భద్రతే కూటం లక్ష్యం అన్నారు. తుఫాన్ ప్రభావంతో నియోజకవర్గం లోని అన్ని చెరువులు, కుంటల కు జలకళ సంతరించుకుందన్నారు. ఆసియా ఖండం లోనే ప్రధానమైన కంభం చెరువు అలుగు పారిదని, ఇటీవల కాలం లో ఎన్నడూ నిదని చెరువులు నిండాయి యని ఇది ఒక విధంగా సంతోషకరమైన విషయం అన్నారు. చెరువుల, కుంటల నిండిన సమయంలో ఇరిగేషన్ శాఖ అధికారులు గట్టిచేయలే చేపట్టారని పేర్కొన్నారు. పంట నష్టం పై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందేవిధంగా చేస్తామని తెలిపారు.

## దెబ్బతిన్న ప్రతి ఎకరాకు నష్టపరిహారం చెల్లించాలి

### అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం



**మార్కాపురం ఆర్.సి ఇంచార్జ్ పెన్ పవర్ అక్టోబర్ 30**

మేంథా తీవ్ర తూఫాన్ కారణంగా నియోజకవర్గంలో దెబ్బతిన్న ప్రతి ఎకరాకు నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచించారు. నియోజకవర్గం వ్యాప్తంగా అధిక మొత్తంలో వర్షపాతం నమోదు నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా పంటలు దెబ్బతిన్నాయి. మార్కాపురం ఏడిఏ,, దర్శి ఏ డి ఏ, మార్కాపురం, తర్లుపాడు, కొనకకనమిట్ల, పొదిలి మండలాల ఏవోలు, హార్టికల్చర్ ఆఫీసర్, వ్యవసాయ శాస్త్రవేత్తలతో తన స్వగృహంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

## చెరువులకు జలకల తెచ్చిన గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

### కొమరోలు చెందిన దామెర్ల చెరువు పడిదబ్బచెరువు వద్ద

### పూజలు నిర్వహించిన కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి





**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 30**

మండలంలోని చెరువులను నింపి జలకల తెచ్చిన గంగమ్మ తల్లికి కృతజ్ఞతలు తెలియజేస్తూ గురువారం కొమరోలు సహకార సంఘం చైర్ పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని దాదాపు అన్ని చెరువులకు సమృద్ధిగా నీరు చేరింది . దీనితో దాదాపు మూడు సంవత్సరాల తర్వాత చెరువులకు జలకల వచ్చింది .కొమరోలు చెందిన దామెర్ల చెరువుకు ఐదు నెలలకు సరిపడా నీరు చేరగా, పడి దెబ్బచెరువుకు కూడా భారీగా నీరు చేరింది. ఇక మండలంలోని రాజుపాలెం చెరువు నిండి అలుగు పారింది .అలాగే తాటిచెర్ల కు చెందిన తాడేమ్మ వారి చెరువు కూడా నిండింది. అలాగే మండలంలోని దాదాపు చెరువులకు సమృద్ధిగా చేరింది. దీనితో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆ సందర్భాన్ని దృష్టిలో ఉంచుకొని కొమరోలు సహకార సంఘం చైర్పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి, పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు రైతులతో కలిసి గురువారం దామెర్ల చెరువును సందర్శించి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పడిదబ్బ చెరువు కట్టపై వెలసిన గంగమ్మ తల్లి ఆలయానికి వెళ్లి అక్కడ గంగమ్మ తల్లికి కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించి కృతజ్ఞతలు తెలియజేశారు .చెరువులు జలకలను సంతరించుకున్న కారణంగా మండలంలో రైతులు వరి పంట తో పాటు పలు రకాల పంటలు సాగు చేసి మంచి దిగుబడులు పొంది సంతోషంగా జీవించాలని సంజీవరెడ్డి ఆకాంక్షించారు .ఆ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు వీరం రెడ్డి శంకర్ రెడ్డి, పులకుర్తి వెంకటేశ్వర్లు ,బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్ తిరుమలరెడ్డి ,,కొమరోలు వార్డు మెంబర్ షేక్ సుభాని, తోపాటు పలువురు టిడిపి నేతలు రైతులు పాల్గొన్నారు.

## మండల లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఉగ్ర

### పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మండల టిడిపి నాయకులు





**కనిగిరి, పెన్ పవర్ అక్టోబర్ 30**

సి ఎస్ పురం మండల పరిధిలో మండల పదిమందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పంపిణీ చేశారు బుధవారం కనిగిరిలోని అమరావతి గ్రౌండ్ తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో మండల టిడిపి నాయకులతో కలిసి లబ్ధిదారులకు 5 లక్షల 51 వేల 701 రూపాయలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా మండల టిడిపి నాయకులు మాట్లాడుతూ కష్ట కాలంలో ప్రజలకు అండగా ఉంటూ తక్షణమే సహాయం అందిస్తూ, ప్రతి అరుడి ఇంటికి చేరేలా చర్యలు తీసుకుంటున్న శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు రిలీఫ్ ఫండ్ ద్వారా లబ్ధిదారులకు కొంత ఊరట లభించిందని అన్నారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్, మండల ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, మండల క్లస్టర్ ఇన్చార్జి కోనంగి వెంకటకొండయ్య, పంచాయతీ వార్డు మెంబర్ తెలుగు యువత నాయకులు మన్నేపల్లి కార్తీక్ నాయుడు, మండల తెలుగు యువత, ఎస్సీ సెల్ అధ్యక్షులు కామనబోయిన వెంకటస్వామి, కువ్వారపు యేసు రత్నం, మండల బీసీ సెల్ ఉపాధ్యక్షులు అన్నెబోయిన తిరుపతయ్య, పట్టణ అధ్యక్షులు బత్తుల వెంకటాద్రి, బత్తుల శ్రీనివాసులు, చీపు శ్రీనివాసులు, పసుపులేటి గురు కృష్ణ, పావలి తిరుపతయ్య, బత్తుల పూర్ణ, ఎడవల్లి సుబ్బయ్య, సామల తిరుపతిరెడ్డి, పోకల రవిచంద్ర, తిరుపతయ్య, నన్నసాని మహా లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు

# తగ్గు ముఖం పట్టిన వాగుల ప్రవాహ ఉద్ధృతి.

### రాకపోకలు సాగించేందుకు ప్రయత్నిస్తున్న ప్రజలు.



**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 30**

తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పొంగిపొరలి ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు గురువారం నుంచి శాంతించడంతో ప్రజలు వాగులను అదిగ మించి రాకపోతే సాగించేందుకు ప్రయత్నిస్తున్నారు. భారీ వర్షాలకు కొమరోలు మండలం బాధినేనిపల్లి గ్రామ సమీపంలోని పులి వాగు రోడ్డుపై నిర్మించిన చట్టాపై గత రెండు రోజులుగా ఉధృతంగా ప్రవహించింది. దీనితో చెప్టా పై నాలుగు అడుగుల లోతుతో వాగు ప్రవహించింది, చెప్టాపై రాకపోకలు సాగించడం ప్రమాదకరంగా భావించిన అధికారులు ప్రజల రాకపోకలను నివారించేందుకు హెచ్చరిక బోర్డు ఏర్పాటుతోపాటు చెప్టాకు అడ్డంగా కంచ వేశారు .అంతేకాక రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని కాపలాగా ఉంచారు దీనితో బాదినేనిపల్లి గ్రామంతో పాటుపలు గ్రామాల ప్రజలు రాకపోకలు ఇబ్బందులు పడ్డారు. అయితే గురువారం ఉదయం నుంచి వాగు శాంతించి ఉధృతి ,నీటిమట్టం తగ్గటంతో చెప్టాపై అడుగులోతుమాత్రమే నీరు ప్రవహిస్తూ ఉన్నది. దీనితో పలు గ్రామాల ప్రజలు ఆ దారిపై రాకపోకలు సాగించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక తాటిచెర్ల కు చెందిన తాడేమ్మ వారి చెరువు నిండి కట్టకు ప్రమాదం ఏర్పడడంతో రైతు అలుగు వద్ద గండి కొట్టారు. దీనితో ఆ గ్రామానికి వెళ్లే రోడ్డుపై చెరువు నీరు ఉధృతంగా ప్రవహిస్తూ ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించింది. అయితే రోడ్డుపై ప్రవహిస్తున్న నీటి ప్రవాహం తగ్గటంతో తాటిచెర్ల గ్రామ ప్రజలకు రాకపోకలు సాగించేందుకు సౌకర్యం కలిగింది!.

